సాక్షి నిజామాబాద్

బుధవారం । 11 । జూన్ । 2025



14న జాతీయ లోక్ అదాలత్

ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి అన్నారు.

- 8లో ▸



అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు 'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /21.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

అసంపూర్తిగా డైనింగ్ హాళ్ల నిర్మాణం



సుంకెట్ ఉన్నత పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్ నిర్మాణం

మోర్తాడ్(బాల్కొండ): నిధుల విడుదలలో జాప్యం కారణంగా అనేక పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా మిగిలాయి. బాల్కొండ నియోజకవర్గంలోని పాఠశాలల్లో పూర్తి కావాల్సిన పనులు చాలా ఉన్నాయి. 'మన ఊరు – మన బడి' కార్యక్రమంలో భాగంగా మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత, సుంకెట్ ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్ల నిర్మాణ పనులు చేపట్టగా నిధులు సరిగా విడుదల కాకపోవడంతో పనులు ఇంకా పూర్తి కాలేదు. ధర్మోరాలో అదనపు గదుల నిర్మాణ పనులు స్లాబ్‌కే పరిమితమయ్యాయి. చివరకు దాత సహకారంతో ఇప్పుడిప్పుడే పనులు చేపడుతున్నారు. వేల్పూర్ మండలం జాన్కంపేట్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరగా, మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపట్టిన పనులు మాత్రమే పూర్తికాగా.. 'మన ఊరు – మన బడి' పనులు అసంపూర్తిగా మిగిలాయి. డైనింగ్ హాళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందులు తప్పేలా లేవు.

మోర్తాడ్, వేల్పూర్, పడిగెల్, చౌట్‌పల్లి, కోనసముందర్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, ఏర్గట్ల, భీమ్‌గల్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో మాత్రం సౌకర్యాలు మెరుగుపడటం విశేషం.



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో రేకులు పగిలిపోయి శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం



హున్సాలో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్ల పనులు

అవే శిథిల గదులు

సాక్షి ఫోకస్

- సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు
- 68 స్కూళ్లలో పూర్తికాని పనులు
- నిధులు లేక ముందుకు సాగని పరిస్థితి
- రేపటి నుంచి పునఃప్రారంభం

అరకొర వసతుల మధ్యే ఈ ఏడాది సైతం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వాలు ఎన్నికార్యక్రమాలు చేపడుతున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. నిధుల కొరత కారణంగా వేసవి సెలవుల్లో పనులు పూర్తి కాలేదు. జిల్లాలో 1156 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 760 స్కూళ్లను ఎంపిక చేశారు. రూ.42 కోట్ల 38 లక్షలు నిధులు మంజూరు చేయాల్సి ఉండగా.. రూ.21 కోట్ల 32 లక్షలు మాత్రమే మంజూరు చేశారు.

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. సుమారు 68కి పైగా పాఠశాలల్లో కొన్ని చోట్ల పనులు ఇంకా కొనసాగుతుండగా.. మరికొన్ని చోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. అసౌకర్యాల మధ్యే ఈ విద్యా సంవత్సరం సైతం ప్రారంభం కానుంది. గత ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 'మన ఊరు – మన బడి'ని నిలిపివేయడంతో 40 పాఠశాలల్లో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 'అమ్మ ఆదర్శ కమిటీలను తెరపైకి తీసుకవచ్చి పనులు చేపట్టినప్పటికీ పూర్తి చేయలేదు. 334 ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు, 154 బాలుర పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. 72 స్కూళ్ల భవనాల మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇందులో కొన్నింటిని అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక చేసి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. 57 పాఠశాలలకు అదనపు గదులు అవసరం ఉంది. 23 పాఠశాలల భవనాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. 346 పాఠశాలలకు ఫర్నిచర్ కొరత ఉంది.

పట్టని సంక్షేమం

జిల్లాలో 42 ఎస్సీ, 33 బీసీ, 8 ఎస్టీ వసతిగృహాలున్నాయి. 18 ఎస్సీ వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వేసవి సెలవులకు ముందే వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా నిధులు లేకపోవడంతో పనులను ప్రారంభించలేదు. ఎస్టిమేషన్ నివేదికలు రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించి వేచి చూస్తున్నారు. అలాగే బీసీ, ఎస్టీ వసతిగృహాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలోని బీసీ వసతిగృహం పెచ్చులూడి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

పనులు కొనసాగుతున్నాయి

జిల్లాలో గుర్తించి ప్రభుత్వ బడుల్లో కొన్ని చోట్ల పనులు కొనసాగుతున్నయి. మరికొన్ని ఆలస్యంగా ప్రారంభం కావడంతో పనులు పూర్తి కావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అయినప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– అశోక్, జిల్లా విద్యాశాఖాధికారి

అరకొర వసతులు..



నందిపేట మండలం ఐలాపూర్‌లో శిథిలావస్థకు చేరిన ఎస్సీ హాస్టల్ భవనం

ఆర్మూర్ : మండల పరిషత్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఉన్నత పాఠశాల పాఠశాలల్లో సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్మూర్ మండలంలో 21 ఉన్నత, 41 ప్రైమరీ పాఠశాలలున్నాయి. 50 సంవత్సరాల క్రితం నిర్మించిన కొన్ని పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. ఆర్మూర్ మండలం ఫతేపూర్, గోవింద్‌పేట్ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో బాత్‌రూం తలుపులు మరమ్మతులు చేయాల్సి ఉంది. అలాగే ఈ పాఠశాలకు సంబంధించిన మరో భవనం శిథిలావస్థలో ఉంది.

శిథిలావస్థలో ఐలాపూర్ హాస్టల్ భవనం

నందిపేట మండలంలోని ఐలాపూర్‌లో సంక్షేమ వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.45 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. ఓ వైపు హాస్టల్ భవనం కూలిపోయే స్థితిలో ఉండగా.. మరోవైపు వర్షాలు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



శిథిలావస్థలో మిట్టాపల్లి ప్రాథమిక పాఠశాల

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లిలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. నూతన పాఠశాల భవనం నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. అలాగే మెంట్రాజ్‌పల్లి ఉన్నత పాఠశాల, సాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, కొరట్‌పల్లి, రైల్వేస్టేషన్, కమలాపూర్, డిచ్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలల అదనపు తరగతి గదుల కోసం ప్రతిపాదనలు పంపిస్తే ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు.

'రూరల్'లో మౌలిక సౌకర్యాలు కరువు

మోపాల్ మండలంలో..

మోపాల్‌లోని ఒడ్డెరకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల కురిసిన వర్షానికి తరగతి గది పెచ్చులూడిపోయాయి. రెండు గదులు మాత్రమే ఉండగా, ఒక గది శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడిపోయిన విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం బద్రినాథ్ ఎంఈవో, డీఈవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సిరికొండ మండలంలో..

మండలంలోని 35 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. 32 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, మూడు పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.



మోపాల్ ఒడ్డెర కాలనీలో తరగతి గది పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

ధర్పల్లి, రూరల్ మండల్లాలో..

రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లిలో ప్రాథమిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు రెండు పక్కపక్కనే ఉన్నాయి. ప్రహరీ లేక పోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు వస్తున్నాయి. ధర్పల్లి మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 25 పాఠశాలను అభివృద్ధి చేశారు.

బోధన్: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు గతంతో పోలిస్తే కొంత మెరుగైనప్పటికీ.. తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత, కనీస మౌలిక సౌకర్యాలు తదితర సమస్యలు వెంటాడుతున్నాయి.

■ సాలూర మండలం హున్సా మండల పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతోంది. తరగతి గదులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉందని టీచర్లు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గ్రామ శివారులో నూతన భవన నిర్మాణ పనులు పునాది దశలో రెండేళ్ల క్రితమే ఆగిపోయాయి. ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎండాకాలంలో ప్రారంభించిన మరుగుదొడ్డి నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ పాఠశాలలో ఏడు తరగతులకుగాను నాలుగు గదులున్నాయి. ఆఫీస్ గదిలో తరగతులు నిర్వహిస్తున్నారు.



మూతపడిన బోధన్‌లోని అంబేడ్కర్ నగర్ (కాలనీ) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

వెంటాడుతున్న సమస్యలు

■ బోధన్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల భవనం గదులు బీటల వారి కూలిపోయే దశకు చేరడంతో గత విద్యాసంవత్సరంలోనే సమీపంలోని ద్యాకంగల్లీ ప్రాథమికోన్నత పాఠశాలకు విద్యార్థులను షిఫ్ట్ చేశారు. తట్టికోట కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి ఎత్తు ప్రదేశంలో ఉండటంతో ప్రమాదకరంగా ఉంది. ఈ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు సగంలో నిలిచిపోయాయి.

■ రెంజల్ మండలంలోని దూపల్లి ప్రాథమిక పాఠశాలలో రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో చేపట్టిన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



బీటలు వారిన హున్సా మండల పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గది గోడ

న్యూస్‌రీల్

పిల్లలను ప్రోత్సహించాలి



ఖలీల్‌వాడి: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 6వ జూనియర్ అండర్–17 బాక్సింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, స్నేహభావం పెరగడంతోపాటు నలుగురిలో ఎలా మెలగాలో అలవడుతుందన్నారు. స్వతహాగా తాను బాక్సింగ్ క్రీడాకారుడినేనని.. తాను కాలేజీలో చదివే సమయంలో మూడేళ్లపాటు బాక్సింగ్‌లో శిక్షణ పొందానని తెలిపారు. అనంతరం బాక్సింగ్ కోచ్ శంషాముద్దీన్‌తోపాటు, అంతర్జాతీయ క్రీడాకారుడు అర్జున అవార్డు గ్రహీత ఉసాముద్దీన్‌ను సన్మానించారు. టీఎస్జీఎస్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖలోని బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో రాజశ్రీ పలువురికి మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. ఇద్దరు వైద్యాధికారులు, ఐదుగురు స్టాఫ్ నర్సులు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందుకున్నారు.

కూలిన చెట్లు.. విరిగిన స్తంభాలు

- గాలివాన బీభత్సం
- నేలకొరిగిన 123 విద్యుత్ స్తంభాలు
- మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం
- ఎన్‌పీడీసీఎల్‌కు రూ.18.30 లక్షల నష్టం
- పాక్షికంగా దెబ్బతిన్న 20 ఇళ్లు
- జిల్లాలో 15.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు



నగరంలోని కోటగల్లీ గడ్డమీద విరిగి పడ్డ విద్యుత్ స్తంభాలు

సుభాష్‌నగర్/నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన ఈదురు గాలుల వర్షం బీభత్సం సృష్టించింది. సగటు వర్షపాతం 15.8 నమోదైంది. భారీ వృక్షాలు, 123 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 20 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జిల్లా కలెక్టరేట్ అధికారులు నష్టాన్ని అంచనా వేస్తున్నారు. నష్టం తీవ్రంగా ఉండడంతో విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. నందిపేట్, మాక్లూర్, నవీపేట్ మండలాల్లో వడగండ్ల వాన కురిసింది.

అక్కడక్కడా చెట్ల కొమ్మలు, వృక్షాలు తీగలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కాగా, ఎన్‌పీడీసీఎల్‌కు రూ.18.30 లక్షల నష్టం కలిగింది. గాలులకు ద్విచక్రవాహనాలు కింద పడిపోగా, ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. హోర్డింగులు, ఫ్లెక్సీలు నేలకూలాయి. వర్షంతో కూడిన బలమైన ఈదురు గాలులకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఏర్గట్ల, మోపాల్, పాతంగల్ మండలాల్లో మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. జిల్లా కేంద్రంలో చెట్ల కొమ్మలు విరిగి పడి 17 స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సిబ్బంది కూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి ఐదారు గంటల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఎస్ఈ నుంచి సబ్‌స్టేషన్ ఆపరేటర్ వరకు రాత్రంతా విధుల్లోనే ఉన్నారు. మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వేగంగా విద్యుత్ పునరుద్ధరణపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు.



నగరంలోని వినాయక్‌నగర్ న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో కారుపై పడిన భారీ వృక్షం

వర్షపాతం వివరాలు..

మండలాలు	వర్షపాతం				
		ఆలూరు	33.7	రెంజల్	22.7
ఎడపల్లి	33.9	వర్ని	27.4	నిజామాబాద్ సౌత్	12.0
నవీపేట	35.1	మాక్లూర్	23.5	నందిపేట	23.7
చందూరు	34.0	డొంకేశ్వర్	31.3	నిజామాబాద్ రూరల్	13.4
ఇందల్వాయి	14.4	ఆర్మూర్	31.0	డిచ్‌పల్లి	10.8
బోధన్	15.2	మోపాల్	19.1	మోస్రా	25.1
పోతంగల్	13.8	కోటగిరి	16.6	వేల్పూర్	10.1

చెట్టు కూలి లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

- దాబాపై నుంచి పడి మరొకరు..

ఖలీల్‌వాడి/బాన్సువాడ : ఈదురు గాలి వర్షం వల్ల ఇద్దరు మృత్యువాత పడ్డారు. నిజామాబాద్ నగరం వినాయక్‌నగర్‌లో సోమవారం రాత్రి తీవ్రమైన వర్షానికి సంజీవరెడ్డి కాలనీకి చెందిన

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఆస్వాడ్ శ్రీనివాస్ (55) తల దాచుకోడానికి పక్కనున్న కల్లు బట్టిలోకి వెళ్లాడు. అదే సమయంలో చెట్టుకూలి కల్లు బట్టి రేకులపై బడింది. రేకులు విరిగి శ్రీనివాస్‌పై పడ్డాయి. దీంతో తీవ్రగాయాలైన అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని తాడ్కోల్ శివారులో గల డబుల్ బెడ్ రూం కాలనీకి చెందిన ప్రభు (55) రాత్రి తన ఇంటి డాబాపై పడుకున్నాడు. ఒక్కసారిగా ఈదురు గాలులు రావడంతో నిద్రలోంచి లేచి కిందికి దిగుతుండగా కాలుజారి కింద పడ్డాడు. తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

మోపాల్: మధ్యాహ్న భోజనం తయారీ, పంపిణీలో హెచ్‌ఎంలు, ఏజెన్సీలు సమన్వయం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనంపై ఒకరోజు శిక్షణను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఏజెన్సీల నిర్వాహకులు, హెచ్‌ఎంలకు సూచించారు. వంట పాత్రలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో ఏమాత్రం అలసత్వం పనికిరాదన్నారు. కోర్సు డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం తయారు చేయాలని అన్నారు. పరిశుభ్రత పాటించే విధానాలపై రిసోర్స్ పర్సన్‌లు లింగన్న, సురేశ్ వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం వండే విధానాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని 80 మంది కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, 80 మంది కుక్ అండ్ హెల్పర్లు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన కాంగ్రెస్ నాయకులు

- సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని..
- సముదాయించిన నాయకులు, పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బోధన్ పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు బీటీ నగర్ కాలనీలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. సీనియర్ నాయకుడు, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన సుదర్శన్‌రెడ్డికి అధిష్టానం మంత్రి పదవి ఇవ్వక పోవడం సరికాదని, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అధిష్టానంతో మాట్లాడి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోతే తాము ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామని యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్‌కుమార్‌తోపాటు మరో ముగ్గురు నాయకులు హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు బీటీనగర్ కాలనీకి చేరుకుని పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్‌తో మాట్లాడారు. వాటర్ ట్యాంక్ ఎక్కిన వారిని కిందికి దిగాలని పోలీసులు కోరారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో కలగజేసుకున్న నాయకులు.. తాము పీసీసీ అధ్యక్షుడితో మాట్లాడామని చెప్పడంతో వారు ట్యాంక్‌పై నుంచి కిందికి దిగి వచ్చారు.



వాటర్ ట్యాంక్‌పై యువజన కాంగ్రెస్ నాయకులు

నేడు డీఈవోతో 'సాక్షి' ఫోన్‌ఇన్



వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాక్షి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ తో సాక్షి ఫోన్‌ఇన్ కార్యక్రమం ఉంటుంది. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలు, నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల మార్గదర్శకాల కోసం తల్లిదండ్రులు డీఈవోతో నేరుగా ఫోన్ చేసి మాట్లాడవచ్చు.

తేది : 11-06-2025 (బుధవారం)

సమయం: ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: 95531 30597 / 79950 87611

క్లుప్తంగా

ఎస్సారెస్పీలో పెరుగుతున్న నీటిమట్టం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల వరద నీరు రావడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 2315 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 341 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1062.60 (13.23 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు అన్నారు.

విత్తుకు జీవం పోసిన వాన



బాల్కొండ: ప్రస్తుత సంవత్సరం ముందస్తుగా మే నెలలోనే వర్షాలు కురవడంతో అన్నదాతలు ముందస్తుగానే మక్క, పసుపు పంటను విత్తారు. కానీ పది రోజుల వరకు వర్షాలు కురువక పోవడంతో విత్తనాలు మొలకెత్తక అన్నదాతలు ఆందోళన చెందారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో విత్తుకు ప్రాణం పోసినట్లయిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం విత్తిన విత్తనాలు మొలకెత్తుడకు దోఖా లేదంటున్నారు. మృగశిర కార్తే కాగానే వర్షాలు కురవడంతో విత్తనాలు పూర్తిచేయుటకు రైతులు పంటభూముల్లో బిజీగా గడుపుతున్నారు.

18లోపు ఫీజు చెల్లించండి

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ పరిధిలో ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు,గతంలో ఫెయిల్ అయిన వారు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 లోపు రూ.150 చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 24 లోపు ఫీజులు చెల్లించాలన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌కు రక్షణ చర్యలు కల్పించాలని సెక్యూరిటీ సిబ్బందిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మూడు నెలల సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం కలెక్టర్ ఈవీఎం గోడౌన్‌ను సందర్శించారు. గోడౌన్‌లో సెక్యూరిటీ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించామన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్ద పోలీసులు ఈనెల 8న వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడిపిస్తూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒకరికి మూడు రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

న్యూసెన్స్ చేసిన వ్యక్తికి 8రోజుల జైలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో న్యూసెన్స్ చేసిన గోల్ బంగ్లాకు చెందిన అబ్దుల్ అజీమ్‌కు ఆర్మూర్ కోర్టు జడ్జి 8రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. అజీమ్ సోమవారం అర్ధరాత్రి పట్టణంలో జులాయిగా బైక్‌పై తిరుగుతూ న్యూసెన్స్ చేస్తుండంతో పోలీసులు అదుపులో తీసుకొని కోర్టులో హాజరు పర్చారు. కాగ ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ అతడికి 8రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కనిపించని తల్లి చేపలు

- ముళ్ల పొదల్లో మగ్గుతున్న కేంద్రం
- ఎనిమిదేళ్లుగా ఉత్పత్తి శూన్యం



తల్లి చేపల కేంద్రం



ముళ్ల పొదల్లో తల్లి చేపల కేంద్రం కుండీలు

బాల్కొండ : తల్లిచేపలు లేకపోవడంతో ప్రతి ఏటా చేపపిల్లల ఉత్పత్తి కోసం పోచంపాడ్‌లోని జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం అధికారులు నానా తంటాలు పడుతున్నారు. కానీ, స్వతహాగా తల్లి చేపల పెంపకం చేపడితే నాణ్యమైన చేపపిల్లల ఉత్పత్తికి ఢోకా ఉండదని భావించి కేంద్ర ప్రభుత్వం 2017లో తల్లి చేపల కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దక్షిణ భారతదేశంలోనే పోచంపాడ్ కేంద్రంగా రూ. 5కోట్ల నిధులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాగా, అందులో సగం వాట రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సూచించింది. దీంతో చేపపిల్లల పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల నుంచే తల్లిచేపల కేంద్రానికి నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మళ్లించింది. 2017లో పనులు ప్రారంభమైనా ఇప్పటి వరకు ఒక్క తల్లి చేపను ఉత్పత్తి చేయలేదు. తల్లి చేపల పెంపకంపై అధ్యయనం కోసం జిల్లా నుంచి మత్స్యకారులు, అధికారులు ఒడిశాకు వెళ్లి వచ్చారు. రెండేళ్ల క్రితం ఒడిశా నుంచి తల్లి చేపల పెంపకానికి నాణ్యమైన చేపలను ప్రభుత్వం సరఫరా చేసింది. కానీ, ఆ చేపలు ఎక్కడ ఉన్నాయో అధికారులకే తెలియదు. తల్లి చేపల కేంద్రంలో నీటి కొరత తీవ్రంగా ఉండటంతోనే ఆ చేపలు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

అందుబాటులోకి వస్తే..

తల్లి చేపల పెంపకాన్ని సరిగ్గా నిర్వహిస్తే నాణ్యమైన చేపపిల్లలను ఉత్పత్తి చేయొచ్చు. దీంతో జిల్లాలోని చెరువులకు, ప్రాజెక్టులోకి ఉచితంగా చేప పిల్లల సరఫరా చేసే అవకాశం కలుగుతుంది. కానీ, ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో తల్లి చేపల కేంద్రం ముళ్ల పొదల్లో మగ్గుతోంది. తల్లిచేపల కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తే తల్లి చేపల, చేపపిల్లల టెండర్లలో కమీషన్లకు గండి పడుతుందనే ఉద్దేశంతోనే నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పోచంపాడ్‌లోని తల్లిచేపల కేంద్రం పనుల అసంపూర్తిపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. తల్లి చేపల పెంపకం ఇక్కడే చేపడితే నాణ్యమైన చేప పిల్లలను ఉత్పత్తి చేయొచ్చు.

– దామోదర్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్

విత్తన పసుపునకు డిమాండ్

- బస్తాకు రూ.2 వేలు
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు



బాల్కొండ: పసుపు పంటకు గత సీజన్‌లో మంచి ధర లభించడంతో చాలా మంది రైతులు పసుపు పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో విత్తన పసుపునకు డిమాండ్ పెరిగింది. రెండేళ్ల క్రితం వరకు పసుపు పంటకు ధర లేకపోవడంతో రైతులు గతేడాది సాగు విస్తీర్ణం తగ్గించారు. కానీ, ఊహించని విధంగా పసుపు పంటకు క్వింటాలుకు రూ. 20 వేల వరకు ధర పలకడంతో రైతులు మళ్లీ పసుపు పంట సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం పసుపు సాగు చేసేందుకు విత్తనం అవసరం. కానీ, మార్కెట్‌లో విత్తనం అందుబాటులో ఉండదు. కేవలం రైతుల వద్దనే లభిస్తుంది. దీంతో ప్రస్తుతం బస్తాల చొప్పున పసుపు విత్తనం కొనుగోలు చేస్తున్నారు. ముక్కలు చేసిన పసుపు బస్తాను రూ. 2 వేలకు కొనుగోలు చేస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి వచ్చి..

పసుపు పంట నిజామాబాద్ జిల్లాలోనే అధికంగా సాగు చేస్తారు. కానీ, ప్రస్తుతం పొరుగు జిల్లాలు అయిన నిర్మల్, ఆదిలాబాద్ రైతులు అధికంగా పసుపు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో నిజామాబాద్‌కు వచ్చి విత్తన పసుపును కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు కూడా విత్తన పసుపుతో వ్యాపారం చేస్తున్నారు. ఇక్కడ బస్తా రూ 2 వేలకు కొనుగోలు చేసి వారి ప్రాంతంలో రూ. 2500 లకు విక్రయిస్తున్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

నిజామాబాద్ నాగారం: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో అర్హులకు నేటి నుంచి మండల స్థాయిలో, 16 నుంచి జిల్లా స్థాయిలో ఎంపికపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు అంచెల్లో ఎంపిక ప్రక్రియ..

సికింద్రాబాద్‌లోని హకీంపేట్, కరీంనగర్, అదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుంది. మొత్తంగా బాలురు 60 మంది, బాలికలు 60 మందిని ఎంపిక చేయనున్నారు.మండల స్థాయిలో జూన్ 16 నుంచి 19 జూన్ వరకు ఎంపికలు, అందులో ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో 25న స్థానిక రాజారాం స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారన్నారు. అందులో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో జులై 1 నుంచి జులై 5 వరకు ఎంపికలు జరుగుతాయన్నారు.

ఎంపికలు ఇలా..

30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, 6.10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు, మొత్తం తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు గాను ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తారు. వయసు ధ్రువీకరణ, బోనఫైడ్, నార్మలిటీస్‌లో మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు.

అర్హులు వీరే: 01-09-2016 నుంచి 31-8-2017 మధ్య జన్మించి, 8 నుంచి 9 సంవత్సరాలు వయసు కలిగినవారు ఈ పోటీలకు అర్హులు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

14న జాతీయ లోక్ అదాలత్



నిజామాబాద్ లీగల్: ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి తెలిపారు. జిల్లా కోర్టులో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటార్ వాహన బీమా, మున్సిపల్, పీఎల్‌సీ, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్‌లకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

పట్టుదలకు పోకుండా పట్టువిడుపులతో తమ కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కని మార్గమన్నారు. కేసుల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ప్రత్యేక బెంచులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వడ్డీ వ్యాపారుల వేధింపులతో యువకుడి ఆత్మహత్యాయత్నం

బిచ్కుంద(జుక్కల్): వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక మండలంలోని మాన్యాపూర్ గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి భార్య తెలిపిన వివరాలు ఇలా.. మాన్యాపూర్‌కి చెందిన ముప్పిడి జ్ఞానేశ్వర్ రెండేళ్ల క్రితం వడ్డీ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగారం వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. ప్రస్తుతం రెండేళ్ల వడ్డీతో కలిపి రూ.4.2 లక్షలు అయ్యింది. వడ్డీ చెల్లించాలని గంగారాం అతడి భార్య పరిపూర్ణ ఇద్దరు కలిసి జ్ఞానేశ్వర్‌ను వేధించారు. దీంతో ఆరు నెలల క్రితం జ్ఞానేశ్వర్ రూ.2లక్షల 20వేలు వడ్డీ కట్టాడు. అసలు సొమ్ము రూ.రెండు లక్షలను పొలం అమ్మి ఇస్తానని చెప్పాడు. ఈక్రమంలో సోమవారం గంగారాం తన భార్యతో కలిసి జ్ఞానేశ్వర్ ఇంటికి వచ్చి, డబ్బులు ఇవ్వకుంటే అంతుచూస్తామని బెదిరించారు.

దీంతో గ్రామంలో పరువు పోయిందని జ్ఞానేశ్వర్ మనస్తాపం చెంది గంగారాం ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గంగారాం స్వయంగా తన కారులో బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై బాధితుడి భార్య ఉపాధ్యాయుడు గంగారాం, అతడి భార్య పరిపూర్ణపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆర్మూర్‌లో ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కెనాల్‌కట్టపై నివాసం ఉంటున్న షేక్‌పాషా(56) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మంగళవారం తెలిపారు. షేక్‌పాషా గత కొన్ని రోజులు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే తలుపులు ధ్వంసం చేసి సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నగరంలో వ్యక్తి హత్య

ఖలీల్‌వాడి: నగరంలోని పాంగ్రా శివారులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ఆర్య నగర్‌కు చెందిన దోన వసంత్‌కుమార్ (38) బజాజ్ కంపెనీలో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రివేళ వసంత్ కుమార్ పాంగ్రా శివారులో హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. దుండగులు మృతుడి తలపై రాయితో దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంకా ఇతర పదునైనా ఆయుధాలతో దాడి చేశారా అనే అనుమానం వ్యక్తం చేశారు.రాత్రి కల్లుబట్టిలో కల్లు తాగిన తర్వాత దుండగులు హత్య చేశారా? లేదా ఇతర కారణాలతో హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. క్లూస్‌టీంతో ఆధారాలను సేకరిస్తున్నారు. దీంతోపాటు చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



నగేష్(ఫైల్)

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన కుర్మె నగేష్ అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ మంగళవారం తెలిపారు. గొర్రెల కాపరిగా పని చేస్తున్న నగేష్ సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయి, ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య సుమలత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

ఆర్మూర్‌లో బధిరుల పాఠశాల

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో 12 ఎకరాల సువిశాల స్థలంలో 1983 సెప్టెంబర్‌లో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా, మెదక్ డయాసిస్ ఆధ్వర్యంలో తెలంగాణలోనే ఏకైక బధిరుల పాఠశాల ప్రారంభమైంది.

- ఐదుగురు విద్యార్థులతో ప్రారంభించిన పాఠశాల నేడు ఎంతో మందికి సేవలందిస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో (దివ్యాంగుల్లో) ఆత్మ విశ్వాసాన్ని నింపుతోంది.
- ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులతోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన సుమారు 110 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 15 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు.
- పాఠశాల ప్రారంభం నుంచి సుమారు 500 మందికి పైగా చెవిటి, మూగ విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసుకొని ఆయా ప్రాంతాలలో వివిధ వృత్తులలో జీవనం కొనసాగిస్తున్నారు.
- విద్యార్థులందరికీ సీఎస్ఐ గతంలో ఉచితంగా విద్య, వసతిని కల్పించేది.
- ప్రస్తుతం నామమాత్రపు ఫీజులతో సంస్థను కొనసాగిస్తున్నారు.
- విద్యార్థులకు సామూహిక, వ్యక్తిగత వినికిడి యంత్రాల సహాయంతో పాఠ్యాంశాలను బోధిస్తూ ఆడిటరీ ట్రెయినింగ్, స్పీచ్ థెరపీని అందిస్తున్నారు.
- వృత్తి విద్య, సాంస్కృతిక, క్రీడా, విద్యా అంశాలలో బధిర విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు.

– ఆర్మూర్

అమ్మమాట- అంగన్‌వాడీ బాట

- అంగన్‌వాడీల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచడమే లక్ష్యంగా కార్యాచరణ
- ఈనెల 10 నుంచి 17 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ



కమ్మర్‌పల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు, చిన్నారుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈనెల 10 నుంచి 17 వరకు 'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట' పేరుతో ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేసింది. స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి అర్హత గల పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. ఈమేరకు సిబ్బందికి ఆదేశాలు సైతం జారీ చేసింది.

ఒక్కో రోజూ..

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ సిబ్బంది కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి అంగన్‌వాడీలు, సిబ్బంది విద్యార్థుల నమోదు కోసం ఇప్పటికే ఇంటింటికి తిరుగుతున్నారు. ఈక్రమంలో అంగన్‌వాడీల్లోనూ ప్రవేశాల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు.

- 10న అంగన్‌వాడీలను అందంగా అలంకరించాలి. చిన్నారులను, వారి తల్లిదండ్రులను కేంద్రాలకు ఆహ్వానించి సెల్ఫీలు తీసుకోవాలి, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించాలి.
- 11న గ్రామాల్లో మూడేళ్లలోపు పిల్లలను గుర్తించాలి. వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా పిల్లల తల్లిదండ్రులకు వివరించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సౌకర్యాలను వివరించి ఆ సేవలు పొందేలా వారిని ప్రోత్సహించాలి. అంగన్వాడీ కేంద్రంలో చదువు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించాలి. అయిదేళ్లు దాటిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించాలి.
- 12,13,16 తేదీల్లో.. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో 'పోషణ వాటిక' (కిచెన్ గార్డెన్లు) అభివృద్ధి చేయాలి. పోషకాహారం గురించి ప్రజలకు వివరించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి, పరిసరాల్లో మొక్కలు నాటాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులను ఆకట్టుకునేలా తగిన వాతావరణాన్ని కల్పించాలి.
- 17న చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలి. అలాగే పాఠాలు, టైం టేబుల్, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలి. స్టడీ మెటీరియల్ అందించాలి.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సౌకర్యాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల నమోదు కోసం ఈనెల 10నుంచి 17 వరకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్న తరుణంలో ఉపాధ్యాయులు, సిబ్బంది బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–ఐ స్వర్ణలత, సీడీపీవో, భీమ్‌గల్

భార్య ఆత్మహత్య కేసులో భర్త రిమాండ్

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్‌కు చెందిన గుంజె అక్షయ నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో అక్షయ మృతికి భర్త సునీల్ వేధింపులే కారణమని మృతురాలి తండ్రి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం సునీల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎండీ మాలిక్ రెహమాన్ తెలిపారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

బాన్సువాడ: బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఒంటిరిగా వెళ్తున్న రాచకొండ భూమవ్వ, మేకల బేతయ్య, మేకల సాయిలు, బీహారి కూలీపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా కరిచాయి. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల సలహా మేరకు అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. నిజామాబాద్ ఆస్పత్రిలో ప్రస్తుతం వీరందరు చికిత్స పొందుతున్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వివిధ ఘటనల్లో పలువురు మృతి చెందారు. నందిపేట, బాన్సువాడ మండలాల పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. అలాగే వేల్పూర్ మండలంలో చెరువులో పడి ఒకరు, నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు..



నందు (ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. చింబోల్లి గ్రామానికి చెందిన ఇల్తాం గంగారాం (40) ట్రాక్టర్‌లోకి డీజిల్ కోసం మంగళవారం రాత్రి బైక్‌పై బీర్కూర్ వెళ్లాడు. అదే రాత్రి డీజిల్ తీసుకుని బైక్‌పై చింబోల్లికి బయలుదేరాడు. అలాగే అన్నారం గ్రామానికి చెందిన సంగెం నందు(18) అనే యువకుడు మార్కెట్ కోసం బీర్కూర్‌కు బైక్‌పై బయలుదేరాడు. బీర్కూర్ మండలం కిష్టాపూర్ శివారులో వీరిద్దరి బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో గంగారం, నందుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న బాన్సువాడ ఎస్సై రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాలను బాన్సువాడ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో పక్కపక్క గ్రామాలకు చెందిన ఇద్దరు మృతి చెందడంతో ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యుల రోదనలు అందరిని కంటతడి పెట్టించాయి.

నందిపేటలో..



రంజిత్ (ఫైల్)

నందిపేట(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేటకు చెందిన ఇమ్ముల రంజిత్(21) అలియాస్ దేవళ్ల సిద్దు అనే యువకుడు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రంజిత్ నందిపేట మండలం సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన తన స్నేహితుడిని వెంటబెట్టుకుని బైక్‌పై మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి నందిపేటకు బయలుదేరాడు. హైదరాబాద్ శివారులో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన పిల్లర్‌ను వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రంజిత్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన మరో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.

వేల్పూర్ మండలంలో..



రాజయ్య(ఫైల్)

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలోగల కొత్త చెరువులో ఓ పశువుల కాపరి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పశువుల కాపరి సెవ్వ రాజయ్య(52) చాలాకాలంగా స్థానిక గురడికాపు వర్గానికి చెందిన పశువులను మేపేవాడు. సోమవారం పశువులను మేపడానికి తీసుకెళ్లగా, చెరువులోకి వెళ్లిన పశువులను తీసుకురావడానికి నీటిలోకి దిగాడు. పశువులను బయటకు తెచ్చే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. మంగళవారం అతడి మృతదేహం తేలడంతో పోలీసులు బయటకు తీసి,, పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి...



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఒక గుర్తుతెలియని వ్యక్తి గుంతకల్లు నుంచి బోధన్ (రైలు నెంబర్ 57411) వెళ్ల రైలులో ప్రయాణిస్తుండగా, అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ దుర్గ ప్రసాద్ ఇచ్చిన సమాచారం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. మృతుడి వయస్సు సుమారు 50–55ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే రైల్వే ఎస్సై 87126 58591 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ ప్రభుత్వ పీఈటీ..



దివాకర్ (ఫైల్)

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన గోడ దివాకర్(45)అనే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు నిజామాబాద్‌లోని కంఠేశ్వర్‌లో నివాసం ఉంటూ మోస్రా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. మే 30న స్కూటీపై తన స్వగ్రామం బ్రాహ్మణపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మాక్లూర్ మండలం దాస్‌నగర్ శివారులో 63వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి భార్య నిరోషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.